www.kalamdaily.com
Follow on: Kalamtelugu
కలం
ప్రజల గళం...
03-03-2026, మంగళవారం

## దుబాయ్ ఎయిర్‌పోర్టులో 18వేల మంది

దుబాయ్.. ప్రపంచంలోనే అతిపెద్ద ఎయిర్ ట్రాన్సిట్ హబ్ కావడంతో ఇక్కడ ప్రభావం ఎక్కువగా ఉంది. 18వేల మంది వరకు ఇక్కడ చిక్కుకున్నారు. ఇందులో విమానాశ్రయం లోపల ఉన్నవారే కాకుండా.. విమానాలు రద్దు కావడంతో బోర్డింగ్ పాస్‌లు తీసుకుని వెయిటింగ్ హాల్స్‌లో ఉన్నవారు కూడా ఉన్నారు.

- దుబాయ్ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్ 3లోనే అత్యధికంగా 8వేల మందికి పైగా భారతీయులు ఉన్నట్లు సమాచారం. దుబాయ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 1, 3 వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటయ్యాయి.
- అబుదాబి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో 7వేల మంది వరకు చిక్కుకున్నారు. ఇక్కడ ఎతిహాద్ ఎయిర్‌వేస్ సర్వీసులు ఎక్కువగా రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- దోహా, మస్కట్, కువైట్ కలిపి దాదాపు 50వేల మంది భారతీయులు ఆయా విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు.
- భారతీయులను ఎయిర్‌పోర్టు నుంచి బయటకు తెచ్చి హోటళ్లలో ఉంచడానికి ఎమర్జెన్సీ ఎంట్రీ పర్మిట్స్ కోసం స్థానిక ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయి.

# ఎట్లున్నరో.. ఏమో!

గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన తెలంగాణ వాసులు.. బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ఎప్పుడేం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. గల్ఫ్ దేశాలపై దాడులను ఇరాన్ తీవ్రం చేయడంతో అనుక్షణం భయంభయంగా గడుపుతున్నారు. జీవనోపాధి, బిజినెస్ పనులు, టూరిస్ట్ వీసాల మీద ఎడారి దేశాలకు వెళ్లినవాళ్లు.. ఎయిర్‌పోర్టుల బంద్ కారణంగా అక్కడ చిక్కుకుపోయారు.

గల్ఫ్ దేశాలపై దాడుల విషయం తెలియగానే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఆందోళనకర వాతావరణం నెలకొన్నది. పొట్ట చేత పట్టుకుని జీవనోపాధి కోసం వెళ్లినవాళ్లు ఎట్లున్నరో.. ఏమోనని ఇక్కడున్న కుటుంబసభ్యుల్లో ఆవేదన నెలకొన్నది. ఎప్పటికప్పుడు ఫోన్లు చేస్తూ క్షేమ సమాచారం తెలుసుకుంటున్నారు. వలస వెళ్లిన తమ వాళ్లను సురక్షితంగా ఇంటికి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. గల్ఫ్‌లో పరిస్థితి, వలస కార్మికులు, వాళ్ల కుటుంబ సభ్యుల ఆందోళనపై కలం కథనం..

– తెలంగాణ / నిజామాబాద్ బ్యూరో, కలం



విమాన సర్వీసులు రద్దు కావడంతో కువైట్ ఎయిర్‌పోర్టులో ప్యాసింజర్ల పడిగాపులు...



ఇరాన్ జరిపిన దాడిలో ధ్వంసమైన దుబాయ్‌లోని పామ్ జుమేరా ఫెయిర్‌మంట్ హోటల్

- గల్ఫ్ దేశాల్లోని తమవాళ్ల కోసం తెలంగాణ వాసుల ఆందోళన
- క్షేమ సమాచారం కోసం ఎప్పటికప్పుడు ఫోన్లు
- ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని కాల్ సెంటర్‌కు వందలాది కాల్స్
- దుబాయ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న రాష్ట్ర వాసులు.. తరలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తులు
- గల్ఫ్ దేశాలపై వరుసగా రెండోరోజూ ఇరాన్ దాడులు

## క్షణక్షణం.. భయం భయం

గల్ఫ్ దేశాల్లోని వలస కార్మికులు, స్టూడెంట్లు, ఉద్యోగులు క్షణక్షణం భయంభయంగా గడుపుతున్నారు. ఎప్పుడు? ఎక్కడి నుంచి బాంబు వచ్చి పడుతుందోననే ఆందోళన వెంటాడుతున్నది. తెలంగాణకు చెందిన దాదాపు 15 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. వీరిలో ఎక్కువగా యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్‌లో పని చేస్తున్నారు. ఇప్పుడు ఆ దేశాల్లోనే ఎక్కువగా దాడులు జరుగుతుండడంతో తెలంగాణ వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తమవాళ్లు ఎట్లున్నరో ఏమోనని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

- దుబాయ్‌లో కొన్ని కంపెనీలు, కాలేజీలు, స్కూళ్లకు సోమవారం హాలీడే ప్రకటించాయి. ప్రజలెవరూ ఎక్కువగా బయట తిరగవద్దని, తమ షెల్టర్లలోనే ఉండాలని అధికారులు సూచించారు.
- దుబాయ్‌లోని హైరైజ్ బిల్డింగ్‌లపై ఇరాన్ జరిపిన మిసైల్, డ్రోన్ దాడుల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇక్కడి కుటుంబాల్లో టెన్షన్ మొదలైంది.


## మేం క్షేమంగానే ఉన్నాం..



నేను దుబాయ్ ఎయిర్‌పోర్టులో పని చేస్తున్నా. నాతో పాటు మా ఊరి వాళ్లు, జిల్లా వాసులు కూడా ఉన్నారు. యుద్ధం కారణంగా రెండ్రోజులుగా డ్యూటీలీవ్. మాకు ప్రమాదమేమీ లేదు. క్షేమంగానే ఉన్నాం. కానీ టీవీల్లో యుద్ధం వీడియోలు చూసి మా కుటుంబ సభ్యులు ఆందోళన పడుతున్నారు. ఫోన్లు చేసి కనుక్కుంటున్నారు.

- చిన్న గంగాధర్, కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం

## అలారం రాగానే బంకర్లలోకి..



ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ సిటీపై మిసైళ్లు పడుతున్నాయి. దాడులు జరుగుతున్నాయి. రెండ్రోజుల్లో 8 పడ్డాయి. మిసైల్స్ వచ్చిన ప్రతిసారీ అలారం మోగుతుంది. ఆ వెంటనే బంకర్లలోకి వెళ్లి తలదాచుకుంటున్నాం. ఇజ్రాయెల్‌లో మొత్తం 50 వేల మంది ఇండియన్స్ ఉంటారు. వీరిలో తెలంగాణ వాసులు 2 వేలకు పైనే. ప్రస్తుతానికి మేమంతా క్షేమం. ఎవరికీ ఏమీ కాలేదు. కానీ అనుక్షణం అలర్ట్‌గా ఉంటున్నాం. అలారం రాగానే బంకర్‌లోకి వెళ్లి దాక్కోవాల్సిందే.

- సోమ రవి, నిజామాబాద్ జిల్లా

## కంట్రోల్ రూమ్‌కు భారీగా కాల్స్

మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ పౌరుల కోసం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24×7 కంట్రోల్ రూమ్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర విదేశాంగ శాఖతో పాటు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో తెలంగాణ భవన్ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. కంట్రోల్ రూమ్‌కు భారీగా కాల్స్ వస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లోని తమ బిడ్డల సమాచారం చెప్పాలని తెలంగాణలోని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఫోన్ చేసి అడుగుతున్నారు. ముఖ్యంగా దుబాయ్, కువైట్‌లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

### 24×7 కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

1. వందన బరువా (పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్ అండ్ లైజన్ హెడ్) 98719 99044
2. సీహెచ్ చక్రవర్తి (పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్) 99583 22143
3. జావేద్ హుస్సేన్ (లైజన్ ఆఫీసర్) 99100 14749
4. రక్షిత్ నాయక్ (లైజన్ ఆఫీసర్) 96437 23157




## గల్ఫ్ దేశాలపై మరిన్ని దాడులు..

గల్ఫ్ దేశాల్లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఆ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తున్నది. వరుసగా రెండోరోజు సోమవారం కూడా గల్ఫ్ దేశాలపై మిసైల్స్, బాంబులు ప్రయోగించింది.

**యూఏఈ:** దుబాయ్, అబుదాబి సిటీల్లోని ఎయిర్‌పోర్టులు, హోటళ్లు లక్ష్యంగా ఇరాన్ దాడులు జరిపింది. ఈ దాడుల్లో ముగ్గురు మరణించారు. వీరిలో పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ వ్యక్తులు ఉన్నారు. మరో 58 మంది గాయపడ్డారు.

**ఖతార్:** దోహా అల్ ఉడీడ్‌లోని యూఎస్ ఎయిర్ బేస్‌పై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో 16 మంది గాయపడ్డారు.

**కువైట్:** యూఎస్ ఎంబసీ, ఎయిర్‌పోర్టుపై డ్రోన్ దాడులతో ఇరాన్ విరుచుకుపడింది. అమెరికా ఆర్మీ విమానాలు కూలిపోయాయి. 32 మంది గాయపడ్డారు.

**బహ్రెయిన్:** మానామాలోని యూఎస్ నేవీ హెడ్ క్వార్టర్స్, ఎయిర్‌పోర్టుపై ఇరాన్ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో నలుగురు గాయపడ్డారు.

**సౌదీ అరేబియా:** సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి జరిపింది. దీంతో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేశారు.

**ఒమన్:** దుక్మ్ పోర్ట్‌పై ఇరాన్ డ్రోన్ దాడి చేయగా, ఐదుగురు గాయపడ్డారు.

## తెలుగు రాష్ట్రాల ప్రయాణికుల గోస

గల్ఫ్ దేశాల్లో పని చేసే వారు, అక్కడి నుంచి ఇతర దేశాలకు వెళ్లే వారు తెలుగు రాష్ట్రాల నుంచే ఎక్కువగా ఉంటారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రెండు రోజుల్లో 60కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. గల్ఫ్‌లోని అన్ని విమానాశ్రయాలు కలిపి తెలంగాణ, ఏపీకి చెందిన సుమారు 20వేల మంది ప్రయాణికులు గోస పడ్తున్నారు. దుబాయ్, కువైట్, మస్కట్, దోహా మార్గాల్లో వెళ్లేవారు ఎక్కువగా ఉన్నారు. దుబాయ్, అబుదాబి ఎయిర్‌పోర్టుల్లో తెలంగాణ, ఏపీకి చెందిన 5వేల మంది చిక్కుకున్నారు. ఇక్కడ రద్దీ పెరగడంతో కొత్త ప్రయాణికులను చెక్–ఇన్ చేయడానికి అనుమతించడం లేదు. ఎయిర్‌పోర్ట్ లోపల ఉన్న హోటళ్లన్నీ నిండిపోయాయి. ప్రయాణికులు గేట్ల వద్దే వేచి చూస్తున్నారు. ఎంబసీ అధికారులు స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఫుడ్ ప్యాకెట్ల పంపిణీ జరుగుతున్నది.

## విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం

గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం పడుతున్నది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిచర్యగా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడటంతో దుబాయ్, దోహా, అబుదాబి వంటి ప్రధాన విమానాశ్రయాలు మూతపడ్డాయి.

- **గల్ఫ్ దేశాల మీదుగా వెళ్లే ప్రధాన విమాన మార్గాలన్నీ మూతపడ్డాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా సుమారు 3వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. 2 రోజుల్లో విమానయాన పరిశ్రమకు సుమారు రూ.10వేల కోట్ల నష్టం వాటిల్లింది. కొన్ని విమానాలను దారిమళ్లించారు. దీంతో ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.**
- **ఎమిరేట్స్, ఖతార్ ఎయిర్‌వేస్, ఎతిహాద్ వంటి సంస్థలు వందలాది విమానాలను రద్దు చేశాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో కూడా గల్ఫ్ దేశాలకు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి.**

## కనెక్టింగ్ ఫ్లైట్లు లేక ఇబ్బందులు

యూరప్ లేదా అమెరికా వెళ్లే రూట్‌లో దుబాయ్ ఒక ట్రాన్సిట్ పాయింట్. విమానాలు రద్దు కావడంతో వేలాది మంది భారతీయులు అక్కడే ఉండిపోయారు. వీరికి అప్పటికప్పుడు వీసాలు లేకపోవడంతో ఎయిర్‌పోర్టు దాటి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విమానాశ్రయాల్లోని లాంజ్, వెయిటింగ్ ఏరియాలు ప్రయాణికులతో నిండిపోయాయి. ఎయిర్ లైన్స్ నిర్వాహకులు కొంతమందికి హోటల్ వసతి కల్పిస్తున్నా, రద్దీ ఎక్కువగా ఉండటంతో చాలా మంది నేలపైనే నిద్రించాల్సి వస్తోంది. ఇరాన్ తన ఎయిర్ స్పేస్‌ను పూర్తిగా మూసివేయడంతో భారత్ నుంచి వచ్చే విమానాలు కూడా అక్కడ ల్యాండ్ అవ్వలేకపోతున్నాయి.



**ఇరాన్ ఎయిర్ స్పేస్ ఓపెన్ చేస్తేనే రాకపోకలు!**

## స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్రం చర్యలు

**మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం.. అక్కడ ఉంటున్న లక్షలాది మంది భారతీయులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. ఎప్పుడు.. ఎక్కడి నుంచి బాంబు దాడి జరుగుతుందనే భయం వారిని వెంటాడుతున్నది. ఈ నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా ఇండియాకు తీసుకొచ్చేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్.. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల విదేశాంగ మంత్రులతో మాట్లాడారు. భద్రతాపరంగా ఇండియన్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.**

- **ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు నిరంతరం అప్రమత్తంగా ఉండి భారతీయులకు కీలక సూచనలు ఇస్తున్నాయి.**
- **ప్రతి భారతీయుడు ఎంబసీ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. అనవసరంగా బయటకు రావొద్దు. లోకల్ సెక్యూరిటీ గైడ్‌లైన్స్ పాటించాలి.**

**ఇజ్రాయెల్ - INDEMBASSYISRAEL.GOV.IN**
**ఇరాన్ - INDIANEMBASSYTEHRAN.IR**
**యూఏఈ - INDEMBASSYUAE.GOV.IN**
**సౌదీ అరేబియా - EOIRIYADH.GOV.IN**
**కువైట్ - INDEMBKWT.GOV.IN**
**ఖతార్ - INDIANEMBASSYQATAR.GOV.IN**
**ఒమన్ - INDEMBASSY-OMAN.GOV.IN**
**బహ్రెయిన్ - EOI.GOV.IN/BAHRAIN/**

- **ఏ దేశంలో ఉన్నారో, ఆ దేశ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ‘REGISTRATION OF INDIAN NATIONALS’ లేదా ‘EMERGENCY REGISTRATION’ అనే లింక్‌ను క్లిక్ చేయాలి.**
- **మెయిన్ రిజిస్ట్రేషన్ పోర్టల్స్: WWW.MADAD.GOV.IN (ఇక్కడ మీరు ‘CONSULAR SERVICES’ కింద రిజిస్టర్ చేసుకోవచ్చు).**
- **గ్లోబల్ ప్రవాసీ రిష్తా పోర్టల్: PRAVASIRISHTA.GOV.IN (విదేశాల్లోని భారతీయులందరినీ అనుసంధానించే పోర్టల్).**

**గతంలో చేపట్టిన ఆపరేషన్ అజయ్ (ఇజ్రాయెల్ - హమాస్ మధ్య యుద్ధం, 2023), ఆపరేషన్ సింధు (ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య 2025) తరహాలోనే ఇప్పుడు కూడా భారీ ఎత్తున భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధమైంది.**

**ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సీ-17 గ్లోబ్ మాస్టర్ విమానాలు, ఎయిర్ ఇండియా విమానాలను స్టాండ్ బైలో ఉన్నాయి.**

**ప్రస్తుతం ఇరాన్, పరిసర దేశాల ఎయిర్ స్పేస్ మూసివేసి ఉండటంతో విమానాలు తిరగడం కష్టంగా ఉంది. ఎయిర్‌స్పేస్ తెరచుకోగానే ప్రాధాన్యత క్రమంలో (ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, మహిళలకు) తరలింపు ప్రక్రియ మొదలవుతుంది.**

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంతో నిరంతరం టచ్‌లో ఉన్నాయి. తమ రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కడెక్కడ ఉన్నారో డేటా ఎంబసీలకు చేరుతున్నది.**

### అందరినీ క్షేమంగా తీసుకొస్తాం



మిడిల్ ఈస్ట్‌లో యుద్ధం కారణంగా చిక్కుకుపోయిన భారతీయులందరినీ క్షేమంగా తీసుకొస్తాం. దీనికోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నది. గతంలో ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ భారతీయులు ఇబ్బందుల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వం వాళ్లను సురక్షితంగా ఇండియాకు తీసుకొచ్చింది. భారతీయులు ఎక్కడున్నా.. వాళ్ల భద్రతే మాకు ముఖ్యం. భారతీయుల భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకునేందుకు సీనియర్ మంత్రులతో అత్యవసర సంప్రదింపులు జరిపాం. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుతం విమాన ప్రయాణాలు ప్రమాదకరంగా ఉన్నాయి. మరిన్ని చర్యలు తీసుకునే ముందు నిపుణుల సలహాలు తీసుకుంటాం.

- ప్రహ్లాద్ జోషి, కేంద్ర మంత్రి




## డ్యూటీల్లేవ్.. రూమ్‌లో ఉంటున్నం

**నేను ఐదేండ్ల కింద దుబాయ్ వచ్చాను. గతంలో జెబెల్ అలీలో ఉండేవాడిని. ఇప్పుడు సోనాపూర్‌లో ఉంటున్నాను. యుద్ధం కారణంగా గత రెండ్రోజులుగా డ్యూటీలు లేవు. సోమవారం నుంచే కొద్ది మందితో పనులు ప్రారంభించారు. యూఏఈపై ఇరాన్ దాడుల కారణంగా ఇంటి దగ్గరున్న మావాళ్లు టెన్షన్ పడుతున్నారు. రోజూ వీడియో కాల్స్ చేస్తున్నారు. మాకైతే ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బంది లేదు. బయట తిరగొద్దని, క్యాంపులోనే ఉండాలని అధికారులు సూచించారు. ఇక్కడ పరిస్థితులు చక్కబడటానికి ఇంకా కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. మాతో పాటు జగిత్యాల, ఆర్మూర్, బాల్కొండ, నిర్మల్ ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది కార్మికులు ఉన్నారు.**

- రాము, నిజామాబాద్